క్లుప్తంగా

బీజేపీలోకి చేరికలు

గచ్చిబౌలి: గిరిజనుల అభ్యున్నతికి తమ పార్టీ కట్టుబడి ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు రవి కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని చంద్రానాయక్‌తాండలో బీజేపీ నాయకుడు రాధాకృష్ణయాదవ్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. గిరిజనులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు తమ పార్టీ ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందన్నారు. గిరిజన మహిళను రాష్ట్రపతిని చేయడం బీజేపీకి మాత్రమే సాధ్యమైందన్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ హయాంలో చంద్రానాయక్‌తాండలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. బీజేపీలో చేరిన వారిలో సునీల్‌సింగ్, శివ, సంతోష్, సిద్దు, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, జైస్వాల్ నరేష్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం


రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

రాయదుర్గం: అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గచ్చిబౌలి డివిజన్‌లోని ప్రశాంత్‌హిల్స్ కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం రాత్రి ప్రారంభించి తెల్లవారుజాము వరకు పనులు చేసినట్లు అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్ ఆదేశాల మేరకు వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పర్యవేక్షణలో పనులు పూర్తి చేశారు.

ప్రత్యేక అలంకరణలో శివాలయం

రాజేంద్రనగర్: అత్తాపూర్ చిన్న అనంతగిరి శివాలయాన్ని ఆదివారం వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ప్రతి సంవత్సరం శివరాత్రి మరుసటి రోజున దేవాలయాన్ని పూలతో అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో ఈ అలంకరణ కార్యక్రమం నిర్వహించారు.

పేకాట ఆడుతున్న వ్యక్తుల రిమాండ్

మణికొండ: ఓ నిర్మాణ సంస్థ లేబర్ క్యాంప్‌లో పేకాట ఆడుతున్న ఆరుగురిని రాజేంద్రనగర్ జోన్ ఎస్ఓటీ, నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగి ఏసీపీ జీవీ రమణగౌడ్ తెలిపిన వివరాల మేరకు.. కోకాపేటలోని జేఎంసీ ప్రాజెక్ట్స్ లేబర్ క్యాంప్‌లో శనివారం రాత్రి కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,76,490 నగదు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

సమస్యను పరిష్కరించాలని ఎంపీకి వినతి


ఎంపీ రంజిత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అలకాపూర్ వాసులు

మణికొండ: ప్రజలు స్థలాలు కొని ఇళ్లు నిర్మించుకున్న తర్వాత దేవాదాయ శాఖ అధికారులు ఆ భూమి తమదంటూ అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్ మాజీ అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని, అక్కడ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆదివారం తుల్జారాం లేఅవుట్ బాధితులతో పాటు అలకాపూర్ టౌన్‌షిప్ వాసులు ఆయన నివాసంలో కలిసి సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే దేవాదాయ, మున్సిపల్ శాఖల అధికారులతో మాట్లాడిన ఎంపీ ప్రజలు గృహాలు నిర్మించుకునే సమయంలో లేని అభ్యంతరాలు వారు తిరిగేందుకు వేసుకునే రోడ్లపై ఎందుకని ప్రశ్నించారు. వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నక్షత్ర అపార్ట్‌మెంట్ సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు నరేంద్ర, దిలీప్, తేజ, విజయ్, సల్మాన్, కామేశ్వర్‌రావు, సూర్య, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ కోచ్‌కు సన్మానం

మణికొండ: ఖేలో ఇండియా రెజ్లింగ్ పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపి పతకాలను సాధించడంలో కోచ్ శ్రీకాంత్‌యాదవ్ కృషి ఎనలేనిదని నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు క్యాతం అశోక్‌యాదవ్ అన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున అత్యధిక పతకాలను సాధించడంతో ఆదివారం ఆయన శ్రీకాంత్‌ను సన్మానించి రూ.20వేల ఆర్థిక సహాయం అందించారు. రాబోయే రోజుల్లో ఇలాంటి పతకాలు మరిన్ని సాధించాలని ఆయన సూచించారు.

ఖాజాగూడ రోడ్డు.. ఇకపై మోడల్ కారిడార్

- మరింత ఆకర్షణీయంగా దాబా కూడలి నుంచి ఔటర్ అండర్ బ్రిడ్జి వరకు ఉన్న రోడ్డు
- రూ.11కోట్లతో అభివృద్ధి చేసేందుకు చర్యలు ముమ్మరం
- త్వరలోనే ఫుట్‌పాత్, సైకిల్‌ట్రాక్ నిర్మాణం
- గ్రీనరీ ఏర్పాటుతో మరింత ఆహ్లాదకరంగా మారే అవకాశం


మోడల్ కారిడార్‌గా అభివృద్ధి చేయనున్న రహదారి

రాయదుర్గం: ప్రస్తుతం మోడల్ రోడ్డుగా ఉన్న రహదారిని మోడల్ కారిడార్‌గా మార్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని దాబా కూడలి నుంచి మధురానగర్, ఖాజాగూడ మీదుగా నానక్‌రాంగూడ ఔటర్ రింగ్‌రోడ్డు అండర్ బ్రిడ్జి వరకు ఉన్న మోడల్ రోడ్డును మోడల్ కారిడార్‌గా మార్చేందుకు అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా రెండు రోజుల క్రితం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ అధికారులు ఇక్కడ పర్యటించారు. దీంతో మోడల్ కారిడార్ పనులు త్వరలోనే ఊపందుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే మెట్రో అధికారులు సైతం ఈ రోడ్డును పరిశీలించి ప్రస్తుత సెంట్రల్ డివైడర్‌పైనే మెట్రో పిల్లర్లు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జీహెచ్ఎంసీ అధికారులు పట్టుదలతో ఉండడంతో కారిడార్ పనులు ఊపందుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

ప్రత్యేక ఆకర్షణగా సైకిల్‌ట్రాక్..

ఖాజాగూడ రోడ్డును మరింత ఆకట్టుకునేలా రూ.11 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. అందులో భాగంగా ఇరువైపులా సైకిల్‌ట్రాక్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. టోలిచౌకి, రాయదుర్గం మీదుగా దాబా కూడలి నుంచి ఖాజాగూడ మీదుగా నానక్‌రాంగూడ ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు ఐటీ, ఇతర ఉద్యోగులు సైకిల్‌పై వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మెట్రో రైలు పనులు ప్రారంభించకముందే సైకిల్ ట్రాక్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే రూ.45 కోట్లతో రోడ్డు నిర్మాణం..

దాబా కూడలి నుంచి మధురానగర్, ఖాజాగూడ మీదుగా నానక్‌రాంగూడ ఔటర్ రింగ్‌రోడ్డు అండర్ బ్రిడ్జి నుంచి విప్రో సర్కిల్ వరకు ఉన్న రోడ్డును విస్తరించి డివైడర్, లైటింగ్ ఏర్పాటు చేయడంతో దీనిని మోడల్ రోడ్డుగా పేర్కొన్నారు. 2.7 కిలోమీటర్లు మేర ఉన్న ఈ రోడ్డును రూ.45 కోట్లతో నిర్మించారు. మొదట్లో 8 లేన్ల రహదారి నిర్మాణం చేపట్టాలని భావించినప్పటికీ భూ సేకరణలో సమస్య కారణంగా ఆరులేన్ల ప్రధాన రోడ్డు, ఇరువైపులా డ్రైనేజీ, ఆ తర్వాత సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని తలపెట్టారు. అయితే కొన్ని చోట్ల మాత్రమే ఆరులేన్ల రోడ్డు నిర్మించి డివైడర్, గ్రీనరీ, లైటింగ్ ఏర్పాటు చేశారు.

- ◆ రోడ్డును పూర్తిగా విస్తరించాలంటే ఇరువైపులా మరింత భూసేకరణ చేయాల్సి ఉండడంతో ఇప్పటి వరకు చేసిన పనులతోనే సరిపెట్టారు. మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ప్రత్యేక చొరవతో నగరంలో ఎక్కడా లేని విధంగా శ్మశానవాటికల స్థలాలను సైతం సేకరించి ఈ రోడ్డును పూర్తి చేశారు. ప్రస్తుతం ఫుట్‌పాత్‌లు, సైకిల్ ట్రాక్‌ల నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణ చేయాలని అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం ఉన్న ఆరు లేన్ల రోడ్డు 8 లేన్లకు మార్చే అవకాశం ఉండకపోవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. సైకిల్‌ట్రాక్, ఫుట్‌పాత్ నిర్మాణంతో పాటు మెట్రో సౌకర్యం కల్పిస్తే ఈ రోడ్డు రద్దీగా మారే అవకాశం ఉంది.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యం ప్రదర్శించి సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం భారతీయ కళాక్షేత్రం శిష్యబృందం సాయినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనలు, కూచిపూడి, కోలాటం ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. సత్యనారాయణ శిష్యబృందం భక్తి సంకీర్తనలను ఆలపించారు. రష్మిత, అశ్విని శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వినాయకకౌతం, పుష్పాంజలి, గణేశ్ వందన, జతిస్వరం, రామాయణశబ్దం, హనుమచాలీసా, జనుతశబ్దం, తరంగం, మల్లికార్జున కౌతం, మంగళం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. వైశాలి బృందం కోలాటం ప్రదర్శనతో అలరించారు.

20 నుంచి వాటర్ పోలో చాంపియన్‌షిప్

గచ్చిబౌలి: గచ్చిబౌలి స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 20 నుంచి 2వ జాతీయ వాటర్ పోలో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొంటాయని, నేవీ, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, బెంగళూర్, జైపూర్‌తో పాటు పలు రాష్ట్రాల జట్లు పాల్గొంటాయని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఉమేష్, చీఫ్ ప్యాట్రన్ కొండా విజయ్‌కుమార్, సమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

బస్తీల్లో పోలీసుల గస్తీ


గస్తీ నిర్వహిస్తున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, ఏసీపీ నర్సింహారావు, సీఐ తిరుపతిరావు

ఫీజోపేట్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి ఆధ్వర్యంలో బస్తీల్లో గస్తీ నిర్వహించారు. మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, సీఐ తిరుపతిరావు, ట్రాఫిక్ వాలంటీర్స్‌తో కలిసి ఆమె ప్రేమ్‌నగర్, ఆదిత్యనగర్, హఫీజ్‌పేట్, మాదాపూర్, కొండాపూర్‌లోని బస్తీల్లో పెట్రోలింగ్ చేపట్టారు. గస్తీ నిర్వహణలో హైదరాబాద్ సైక్లింగ్ టీం సభ్యులు పాల్గొన్నారు.

రంగప్రసాద్ రెసిడెన్సీవాసులకు తాగునీటి కనెక్షన్


సంప్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్, కాలనీవాసులు

శేరిలింగంపల్లి: హుడాట్రేడ్ సెంటర్‌లోని రంగప్రసాద్ రెసిడెన్సీవాసుల చిరకాల కోరిక ఆదివారం సాకారమైంది. రెసిడెన్సీవాసులకు మంజీరా నీటి కనెక్షన్‌ను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ చేతుల మీదుగా ప్రారంభించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కార్పొరేటర్‌ను గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ తాగునీరు అందించడమే జీహెచ్ఎంసీ, ప్రభుత్వ లక్ష్యం అన్నారు. హుడాట్రేడ్ సెంటర్‌ను ఆదర్శకాలనీగా తీర్చిదిద్దడం కోసం ప్రయత్నం చేస్తున్నామని, దశలవారీగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. డివిజన్‌లో ఎక్కడా తాగునీటి సమస్యలు లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రతినిధులు బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రాజ్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్యాంసుందర్, అమర్‌నాథ్, ఆదినారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు

కూకట్‌పల్లి: ఓల్డ్ బోయినపల్లి బీఆర్ఎస్ పార్టీ నాయకులు 20మంది ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మొయిజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి గొట్టిముక్కల వెంగళరావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నజీర్, ఖాజా, ఫిరోజ్, మొజిన్, ముజాఫ్ఫార్, నయీమ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని చెరబండ రాజునగర్, నవజీవన్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బాబాసాహెబ్ డాక్టర్ భీంరావు అంబేడ్కర్ విగ్రహాలను ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, స్థానికులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఓటమెరుగని నాయకుడు ఛత్రపతి


శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గచ్చిబౌలి/రాయదుర్గం: హిందూ సామ్రాజ్య స్థాపన కోసం ఓటమి ఎరుగని నాయకుడిగా 390కి పైగా శత్రురాజ్యాల రాజులతో యుద్ధం చేసి గెలిచిన నాయకుడు ఛత్రపతి శివాజీ అని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. నానక్‌రాంగూడలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఆయన ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత తమ గమ్యం చేరుకోవడంలో శివాజీని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మంతులనాయక్, విఠల్, మీన్‌లాల్‌సింగ్, శివసింగ్, యాదగిరి, శ్రీకాంత్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, ఉమేష్, బబ్లూసింగ్, కవిత పాల్గొన్నారు.

ఘనంగా శోభయాత్ర

మియాపూర్: మియాపూర్‌లో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మియాపూర్ న్యూ కాలనీలోని శివాలయం నుంచి లింగంపల్లి తుల్జాభవాని ఆలయం వరకు విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఘనంగా శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు యోగానంద్, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్, ముప్పా సత్యనారాయణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో బీజేపీ నాయకులు

లైవ్ మ్యూజిక్ షో

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం చిన్నారుల విద్య కోసం ఫండ్ రైజింగ్ కార్యక్రమం నిర్వహించారు. సాఫ్‌కిన్ స్వచ్ఛంద సంస్థకు చెందిన చిన్నారుల విద్యాభ్యాసం, భవిష్యత్ కోసం పామ్‌టెస్ ఐటీ సంస్థ లైవ్ మ్యూజిక్ షో నిర్వహించింది. ఈ లైవ్ షోలో ప్రముఖ సినీ గాయకులు చిత్ర, ఎస్పీ చరణ్ పాల్గొని సినిమా పాటలు పాడి అలరించారు.

నేడు విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నేడు జీవరసాయనాలు, జీవన ఎరువులు, జీవ ఉత్తేజకాలను మొక్కల పోషణకు వినియోగించుకోవడంపై నేడు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ తెలిపారు. ప్రస్తుత కాలంలో సేంద్రీయ వ్యవసాయం, పర్యావరణ అనుకూల వ్యవసాయం, హానికర మందులకు బదులుగా ఇతర ప్రయోగాలు చేస్తామన్నారు.

వైఎస్ షర్మిలను అరెస్ట్ చేయడం దురదృష్టకరం

రాజేంద్రనగర్: ఒక మహిళ గురించి అభ్యంతరకరంగా మాట్లాడిన ఎమ్మెల్యేను అరెస్టు చేయకుండా ప్రశ్నించిన వారిని అరెస్టు చేయడం దురదృష్టకరమని రాజేంద్రనగర్ నియోజకవర్గ వైఎస్ఆర్‌టీపీ యువజన విభాగం కన్వీనర్ సదాల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల గురించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్నారు. తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై, ఎమ్మెల్యే ఇచ్చిన హామీల గురించి బహిరంగ సభలో వైఎస్ షర్మిల ప్రశ్నించారని, ఈ విషయంలో ఆమెను అరెస్టు చేయడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యేను అరెస్టు చేసే బదులు వైఎస్ షర్మిలను అరెస్టు చేయడం దురదృష్టకరమన్నారు. ప్రశ్నించే వారిని అరెస్టు చేయడం బీఆర్ఎస్ పార్టీకి అలవాటైందన్నారు. అరెస్టులు, కేసులతో భయపడేది లేదన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు


గౌలిదొడ్డిలోని శివాలయంలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి/రాయదుర్గం: మహాశివరాత్రి మరుసటి రోజైన ఆదివారం గౌలిదొడ్డిలోని శివాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అర్చన, అష్టోత్తర పూజలు, జలాభిషేకం, పాలాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకారం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో చేపట్టిన అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులకు భోజనం వడ్డించారు.

సోమేశ్వరాలయంలో..

నల్లగండ్లలోని సోమేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వయంగా సోమేశ్వరుడికి అభిషేకం చేసే అవకాశం కల్పించారు. కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, ఆలయ చైర్మన్ చెన్నంరాజు స్వామి వారిని దర్శించుకున్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాములు


మాట్లాడుతున్న రాములు

పటాన్‌చెరు టౌన్: కార్మికులకు వారానికి ఐదు రోజులు మాత్రమే పని ఉండాలని, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో కిర్బీ కార్మికుల జనరల్ బాడీ సమావేశానికి హాజరై మాట్లాడారు. కార్మికులకు వారంలో ఐదు రోజులు, రోజుకు 7 గంటల పని ఉండాలన్నారు. రాష్ట్రంలో కాల పరిమితి ముగిసిన జీఓలను వెంటనే సవరించాలన్నారు. కనీస వేతనం కోసం మార్చి 6వ తేదీన 'చలో లేబర్ కమిషన్ కార్యాలయం' నిర్వహిస్తున్నామని, కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్ని అమ్మడం దుర్మార్గమన్నారు. రవాణా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య, యూనియన్ జనరల్ సెక్రెటరీ రాజు, నాయకులు శ్రీనివాస్, మల్లేశ్, సుధాకర్, లఖాన్, ఏడుకొండలు, ప్రభు, మహేశ్వర్ రెడ్డి, శంకర్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు. ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, సప్తగిరి కాలనీ, బీహెచ్ఈఎల్ హెచ్ఐజీ, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, మైత్రీనగర్ ఫేజ్ 1,2,3, ప్రకాష్‌నగర్, వినాయకనగర్, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, సాయిరాం టవర్స్, వైశాలీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

- ◆ వైశాలీనగర్ ఫీడర్ పరిధిలో వైశాలీనగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, ఏపీఎన్‌జీఓ కాలనీ తదితర ప్రాంతాల్లో.. ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలో ఆదిత్యనగర్, సుభాష్‌చంద్రబోస్ నగర్, కృష్ణకాలనీ, హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.
- ◆ మర్తాండనగర్ ఫీడర్ పరిధిలో మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ ప్రధాన రోడ్డు ప్రాంతాల్లో.. హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో ప్రకాష్‌నగర్, వినాయకనగర్, హ్యూండయ్ షోరూం వెనుకవైపు ప్రాంతం, హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ రోడ్డు, యూత్ కాలనీ, సాయినగర్ కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్ విలేజ్, ప్రభుత్వ హాస్పిటల్ ఏరియా, హఫీజ్‌పేట్ ప్రధాన రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- ◆ ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలో ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, వినాయకనగర్, జయప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో.. జనప్రియనగర్ ఫీడర్ పరిధిలో ఆల్విన్ ఎక్స్ రోడ్డు, జనప్రియ అపార్ట్‌మెంట్స్, జనప్రియనగర్, హఫీజ్‌పేట్ ప్రాంతాల్లో.. మైత్రీనగర్ ఫీడర్ పరిధిలోని ఆల్విన్ క్రాస్ రోడ్డు, జనప్రియ అపార్ట్‌మెంట్స్, జనప్రియనగర్, హఫీజ్‌పేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

గచ్చిబౌలి డివిజన్ పరిధిలో..

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బ్రహ్మకుమారీస్ ఫీడర్ పరిధిలోని శాంతి సరోవర్, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, జీపీఆర్ఏ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో, ఎల్ అండ్ టీ సబ్ స్టేషన్ పరిధిలోని సాయి ఐశ్వర్య లేఅవుట్, సాయి వైభవ్ కాలనీ, ఖాజాగూడ విలేజ్, ఘనశ్యామ్ సూపర్ మార్కెట్, నిహారిక కన్‌స్ట్రక్షన్స్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జీవీ కాలనీ, కేంద్రీయ విహార్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మియాపూర్ డివిజన్ పరిధిలో..

మియాపూర్: ఎస్ఆర్ ఎస్టేట్, ఈ–సేవా ఫీడర్, నీలిమా గ్రీన్ ఫీడర్, ఏఎస్‌రాజు ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు ఎస్ఆర్ ఎస్టేట్ ఫీడర్ పరిధిలో మియాపూర్ మెయిన్ రోడ్డు, ఫ్రెండ్స్ కాలనీ, లిటిల్ రాక్ అపార్ట్‌మెంట్, ఎస్ఆర్ ఎస్టేట్‌లో.. 11:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ–సేవా ఫీడర్ పరిధిలోని మియాపూర్ విలేజ్, మియాపూర్ టెలిఫోన్ ఎక్ఛేంజ్, పాట్లపల్లి అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు నీలిమ గ్రీన్స్ ఫీడర్ పరిధిలోని ప్రగతి ఎన్‌క్లేవ్, వీడియా కాలనీ, ఎస్‌పీఐ కాలనీ.. 4:30 గంటల నుంచి 5:30 వరకు ఏఎస్ రాజ్ ఫీడర్ పరిధిలోని ఆర్‌వీ నిర్మాణ అపార్ట్‌మెంట్, నీలిమా గ్రీన్స్, రాధ అపార్ట్‌మెంట్, లా గార్డెనియా అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.